సాక్షి
జోగుళాంబ గద్వాల

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



నేటి నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ

పాలమూరు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్–13 బ్యాడ్మింటన్ టోర్నీ జరగనుంది.

-IIలో ▸



జూరాలకు తగ్గుతున్న వరద

ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద రోజురోజుకు తగ్గుముఖం పట్టింది.

-IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /22.9

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర కబడ్డీ పోటీల్లో విజేతగా జిల్లా జట్టు



గద్వాలటౌన్: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరుగుతున్న యువ ప్రో కబడ్డీ పోటీలలో జోగుళాంబ గద్వాల లయన్స్ జట్టు విజేతగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా తెలంగాణ యువ ప్రో కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. ఈ యువ ప్రో కబడ్డీ పోటీలలో జిల్లా క్రీడాకారులు అత్యంత క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జోగుళాంబ గద్వాల జట్టు, యాదాద్రి వారియర్స్ జట్టుతో తలపడింది. 33– 20 పాయింట్ల తేడాతో జోగులాంబ గద్వాల లయన్స్ జట్టు విజయం సాధించింది. విజేతగా నిలిచిన జిల్లా జట్టుకు రూ.లక్ష నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహా, చైర్మన్ అబ్రహాం, ట్రెజరర్ చందు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిలు పాల్గొన్నారు.

రేపు జీపీఓలకు నియామక పత్రాలు

గద్వాల: నూతనంగా ఎంపికైన జీపీవోలకు ఈనెల 5వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. ఇందుకు సంబంధించి అభ్యర్థులకు ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పెండింగ్ డీఏ సత్వరమే ప్రకటించాలి



అలంపూర్: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏ సత్వరమే ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. ఉండవెల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీవీబీ, గురుకుల పాఠశాలను టీఎస్ యూటీఎఫ్ నాయకులు బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రకటించి సీపీఎస్ విధానం రద్దు చేయాలన్నారు. అలాగే, కేజీవీబీ, గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షుడు కుమార్ నాయుడు, మండల అధ్యక్షుడు నరేష్, నాయకులు మునిస్వామి, విజేయుడు, కురుమూర్తి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా కళా ఉత్సవ్ పోటీలు



గద్వాలటౌన్: విద్యార్థులలో అంతర్గతంగా దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించేందుకు నిర్వహించిన కళా ఉత్సవ్ -2025 పోటీలు ఉత్సాహంగా సాగాయి. విద్యాశాఖ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలభవన్‌లో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు జరిగాయి. మొదటి రోజు గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, ఆట బొమ్మల తయారీ, సంప్రదాయ కథలు తదితర విభాగాలలో పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు తమ అద్భుతమైన ప్రతిభతో ఆకట్టుకున్నారు. న్యాయ నిర్ణేతల మెప్పు పొందారు. పలువురు విద్యార్థులు సంస్కృతీ సాంప్రదాయాలు, జీవనశైలి తదితర అంశాలతో కూడిన కథలు, వాయిద్యాలు ప్రదర్శించారు. మరికొందరు సంగీత విభాగంలో పాటలు పాడి అబ్బురపర్చారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు జిల్లా విద్యా సమన్వయ అధికారిణి ఎస్తేరురాణి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు. సమాజాన్ని చైతన్యపర్చేలా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాలన్నారు. పాశ్చాత్య సంస్కృతి నుంచి ఉపశమనం పొందేందుకు సాంప్రదాయ కళలు పరిపూర్ణంగా దోహద పడతాయన్నారు. చిన్నారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని సూచించారు. 4వ తేదీ నృత్యం, నాటికలు, చిత్రలేఖనం పోటీలు ఉంటాయన్నారు.జయప్రకాష్, శోభరాణి, శుభ, శివకుమార్, కృపయ్య, భాను ప్రకాష్ పాల్గొన్నారు.



వేదికపై తెలంగాణ గీతాలాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. చిత్రంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, పర్ణికారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మధుసూదన్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు కొత్వాల్, శివసేనారెడ్డి, ఎస్‌జీడీ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులు

ఎడ్యుకేషన్.. ఇరిగేషన్

ఇవే పాలమూరు తలరాతను మారుస్తాయి

- అప్పుడే వలసలు ఆగుతాయి..
- ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నా..
- ఏ అవకాశం వచ్చినా మొదటి ముద్ద పాలమూరుకే..
- 'కొడంగల్' భూనిర్వాసిత రైతులకు న్యాయం చేస్తాం
- ఎస్‌జీడీ ఫార్మా 2వ యూనిట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



పాలమూరుకే మొదటి ముద్ద..

పేదరికం, వలసలు, సమస్యలను చూపించడానికి నాటి పాలకులు ప్రపంచ నాయకులను పాలమూరు జిల్లాకు తీసుకొచ్చేవారు. భవిష్యత్‌లో మన అభివృద్ధి, పరిశ్రమలు, యూనివర్సిటీలు, సాగు నీటి ప్రాజెక్టులను సందర్శించేలా అభివృద్ధి చేసుకోవాలి. వీటిని చూసేందుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు రావాలి. పరిశ్రమలు కావాలంటే భూములు కావాలి. ఎక్కడెక్కడ భూములు ఉన్నాయో వాటి వివరాలను అధికారులు నాకు పంపాలి. ఏ పరిశ్రమ వచ్చినా మొదటగా పాలమూరుకు పంపుతాను. నాకు ఏ అవకాశం వచ్చినా మొదటి ముద్ద పాలమూరు ప్రజలకు పెడుతా. మంత్రి వర్గంలోని మంత్రులు ఏమనుకున్నా మంచిదే.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'పాలమూరు జిల్లా అంటే ఒకనాడు వలసలకు మారుపేరు. ఈ దేశంలో భాక్రానంగల్, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ.. ఇలా ఏ మూలన ప్రాజెక్టులు కట్టినా తట్ట పని, మట్టి పని చేయాలంటే పాలమూరు బిడ్డలే కావాలి. వారి భాగస్వామ్యం లేకుంటే ఏ నిర్మాణాలు పూర్తి కాలేదు. దీనికి ప్రధానం కారణం చదువులో వెనకబాటు, సాగు నీరు అందుబాటులో లేకపోవడమే. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాల్లోని పెద్దలు ప్రయత్నం చేయకపోవడంతో ఇప్పటికీ వలసలు ఆగలేదు. అందుకే పాలమూరు బిడ్డగా నా బాధ్యత నెరవేరుస్తా. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ లక్ష్యంగా పాలమూరు జిల్లా ప్రజల తలరాతలు మార్చేందుకు కృషి చేస్తా.' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల శివారులోని ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీస్ రెండో యూనిట్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన ఫర్నేస్ లైటింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ 'పాలమూరు బిడ్డల చదువు కోసం ఏది కావాలన్నా.. ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. పాలమూరు ప్రాజెక్ట్‌లకు గ్రీన్‌చానల్ ద్వారా నిధులు అందించి పూర్తి చేస్తాం. రాజకీయ కారణాలతో అభివృద్ధిని అడ్డుకుంటే మనకు మనమే మరణ శాసనం రాసుకున్నవాళ్లమవుతాం.' అని పేర్కొన్నారు. ఇంకా రేవంత్ ఏమన్నారో ఆయన మాటల్లోనే..

నియోజకవర్గానికో ఏటీసీ..

హైదరాబాద్ రాష్ట్రానికి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితే మళ్లీ 75 ఏళ్ల తర్వాత మీ అందరి ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రానికి పాలమూరు నాయకత్వం వహిస్తున్నది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకపోతే.. విద్య, ఇరిగేషన్, ఉపాధి రంగాల్లో సరైన ప్రణాళికతో జిల్లాను అభివృద్ధి చేసుకోకపోతే శాశ్వతంగా మన జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుంది. అందుకే ఇంజనీరింగ్, లా కాలేజీ, డిగ్రీ కాలేజీలతో పాటు ట్రిపుల్ ఐటీని పాలమూరు జిల్లాకు మంజూరు చేశాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఒక్కో నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున రూ.2,800 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అంతేకాకుండా ఉమ్మడి పాలమూరులో 14 అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల (ఏటీసీ)ను ఏర్పాటు చేస్తున్నాం. దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేసుకునే విధంగా ఆ సెంటర్లలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తాం. విద్య ఒక్కటే మన తలరాతలు మారుస్తుంది. పాలమూరు బిడ్డలు వలసల బారి నుంచి బయటపడాలంటే చదువొక్కటే మార్గం. పాలమూరు జిల్లా నుంచి ఇంజినీర్లు, డాక్టర్లే కాదు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా ఎదగాలి. నూతన పరిశ్రమలకు వేదిక మహబూబ్‌నగర్ కాబోతోంది.



ఎస్‌జీడీ టెక్నాలజీస్ కంపెనీ రెండో యూనిట్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. చిత్రంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రైతులకు న్యాయం చేస్తాం..

కర్ణాటక సరిహద్దులో అత్యంత వెనుకబడిన ప్రాంతం మక్తల్, నారాయణపేట, కొడంగల్. ఈ ప్రాంతానికి నీళ్ల కోసం 2014లో ఉమ్మడి రాష్ట్రంలో 69 జీఓ ద్వారా తెచ్చుకుంటే ఎంపీగా పనిచేసిన కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి మా ప్రాజెక్టును తొక్కిపెట్టి అన్యాయం చేశారు. అందుకే సుమారు రూ.4 వేల కోట్లతో ఈ ప్రాజెక్ట్‌కు టెండర్లు పిలిచి ముందుకు వెళుతుంటే.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసి అడ్డుకుంటున్నారు. కొడంగల్‌లో కోల్పోయినవి కమర్షియల్ భూములు కావడంతో అక్కడి వారికి ఎకరాకు రూ.20 లక్షలు ఇచ్చారు. మిగతా ప్రాంతాల్లో రూ.11 లక్షల వరకు ఇచ్చాం. నారాయణపేటలో రూ.14 లక్షలు ఇస్తున్నాం. భూసేకరణకు సంబంధించిన వివాదాలపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే, కలెక్టర్ రైతులతో మాట్లాడాలి.. భూసేకరణ విషయంలో వారంపాటు సమయం కేటాయించి రైతులతో మాట్లాడాలి. వారిని ఒప్పించి.. మంచి పరిహారం అందించాలి. భూములు కోల్పోతున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి. రైతులకు నష్టం జరిగితే మాకు జరిగినట్లే. మీకు న్యాయం చేసే బాధ్యత మాది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్ పూర్తి చేసుకోకపోతే, పాలమూరు-రంగారెడ్డి, భీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు ప్రాజెక్టులు పూర్తి చేసుకోకపోతే.. ఎప్పుడూ పూర్తి చేసుకోలేం. నిధుల ఇబ్బందులు ఉన్నా.. మన జిల్లా మీద ప్రత్యేక దృష్టి పెట్టి అందజేస్తున్నాం. రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, పర్ణికా రెడ్డి, వీర్లపల్లి శంకర్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎస్‌జీడీ టెక్నాలజీస్ ఎండీ దీపక్ సర్జిత్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం వచ్చినా సముచిత న్యాయం జరగలేదు..

ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పాలమూరు జిల్లా ప్రజలు అండగా నిలిచి మాజీ సీఎంను ఎంపీగా గెలిపించారు. పార్లమెంట్ సభ్యుడిగా తెలంగాణ రాష్ట్ర సాధనలో లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించినా.. రాష్ట్రం వచ్చిన తర్వాత మన ప్రాంతానికి సముచిత న్యాయం జరగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, జూరాల, నెట్టంపాడు, కోయిల్‌సాగర్, భీమా లాంటి ప్రాజెక్టులు ఏవి కూడా సంపూర్ణంగా పూర్తికాలేదు. ఆనాడు సోనియాగాంధీ నాయకత్వంలో పాలమూరు యూనివర్సిటీ మంజూరు చేసినా అదొక పీజీ కళాశాలగా మిగిలిపోయింది. యూనివర్సిటీ హోదాలో ఉండాల్సిన ఇంజినీరింగ్, లా, ఇతర కళాశాలలు లేకపోయాయి.

యూరియా కోసం పడిగాపులు



అయిజ సింగిల్‌విండో కార్యాలయం వద్ద యూరియా కోసం క్యూపద్ధతిలో పాదరక్షలను ఉంచి ఎదురుచూస్తున్న రైతులు

అయిజ: యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి ఎండనకా.. వాననకా యూరియా పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. బుధవారం అయిజ సింగిల్‌విండో కార్యాలయానికి ఉదయాన్నే పెద్ద ఎత్తున రైతులు యూరియా కోసం తరలివచ్చారు. అధికారులు వచ్చి టోకెన్లు ఇచ్చేంత వరకు ఎంత సమయం పడుతుందో తెలియక.. అంతసేపు నిలబడలేక పాదరక్షలను క్యూలో పెట్టి ఎదురుచూశారు. అనంతరం సింగిల్‌విండో సిబ్బంది పాదరక్షల ఆధారంగా రైతుల వివరాలు సేకరించి టోకెన్లు జారీ చేశారు. ఈమేరకు సింగిల్‌విండో కార్యాలయంలో యూరియా బస్తాలను అందజేశారు.

కృష్ణానదిలో అల్లు అరవింద్ తల్లి అస్థికల నిమజ్జనం



ఎర్రవల్లి: జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని బుధవారం సినీ నిర్మాత అల్లు అరవింద్ కుటుంబసమేతంగా సందర్శించారు. ఇటీవల ఆయన మాతృమూర్తి అల్లు కనకరత్నం అనారోగ్యంతో మృతి చెందగా.. ఆమె అస్థికలకు కృష్ణానది పుష్కరఘాట్ వద్ద అనిల్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం కనకరత్నం చితాభస్మాన్ని కృష్ణానదిలో కలిపి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకున్నారు. అల్లు అరవింద్ వెంట ఆయన కుమారుడు అల్లు బాబీ, ఇతర కుటుంబసభ్యులున్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

గద్వాల: జిల్లా కేంద్రంలో జరిగిన అభివృద్ధిని అంకెలతో సహా చెప్పడానికి సిద్ధమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సవాల్‌కు ఆయన స్పందిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. మీరు ఏడేళ్ల పాలనలో గద్వాలకు తీసుకొచ్చిన నిధులు ఎంత వాటి వివరాలను అంకెలతో సహా ప్రజలకు వివరించాలన్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో ఎంతనిధులతో అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు ఎంతనో వివరించాలన్నారు. గోన్‌పాడు, పరమాల వద్ద కట్టిన డబుల్‌బెడ్రూం ఇళ్లు శిథిలావస్థకు చేరినప్పటికీ వాటిని నేటివరకు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. పిల్లిగుంట్ల వద్ద పేదలకు ఇచ్చిన ప్లాట్లు లాక్కుని వారిని రోడ్డున పడేసిందెవరని, నియోజకవర్గంలో ఒక్కరోడ్డు అయినా వేయించారా, కనీసం దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులైన చేశారా అని ప్రశ్నించారు. నెట్టెంపాడు ప్రాజెక్టులో 99, 100 ప్యాకేజీల పరిధిలో పనులు ఎందుకు పెండింగులో ఉన్నాయని, గుర్రంగడ్డ, గట్టు ఎత్తిపోతలు ఎక్కడ వేసిన పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. ఇసుక, మట్టి దందాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నది మీరు, మీ అనుచరులు కాదా అన్నారు. నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది డీకే అరుణ హయాంలోనే జరిగిందని, దీనిపై బహిరంగ చర్చకు మేము సిద్ధమని తేదీ, స్థలం మీరే నిర్ణయించండని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, చిత్తారికిరణ్, శ్యామ్‌రావు, రజక జయశ్రీ, నర్సింహులు, దేవదాసు, అనిల్, మాలీం ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆలయ స్థలం కబ్జాపై ఏసీ విచారణ

సాక్షి ఎఫెక్ట్..

గద్వాల: జిల్లా కేంద్రంలోని దేవాదాయ శాఖకు సంబంధించిన స్థలాన్ని ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఆలయానికి చెందిన స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేయగా.. 'కబ్జా కోరల్లో దేవుడి స్థలం' అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి స్పందించారు. బుధవారం ఆయన గద్వాలకు చేరుకొని దేవాదాయ శాఖకు చెందిన షాపులు, స్థలంపై క్షేత్రస్థాయిలో విచారించారు. షాపులకు సంబంధించిన స్థలం కొంతభాగం కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. వీటిపై రికార్డుల ఆధారంగా సర్వే చేయించి అవసరమైన చర్యలు తీసుకుంటామని, కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని సంరక్షిస్తామని అన్నారు.



కబ్జా కోరల్లో దేవుడి స్థలం

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి



ఇటిక్యాలలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

ఇటిక్యాల/ఎర్రవల్లి: ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేసేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఇటిక్యాల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణ పనుల్లో నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు జరిగేలా లబ్ధిదారులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు కూలీ, రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వివిధ దశలను అనుసరిస్తూ డబ్బును వెంటనే ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భవిష్యత్ కోసం నాణ్యమైన విద్య అందించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, వసతి, భోజనం, శుభ్రత, భద్రతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీర భద్రప్ప, ఎంపీడీఓ అబ్దుల్ సయ్యాద్ ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎర్రవల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి భూ భారతి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. భూ భారతి పోర్టల్‌లో డేటా ఎంట్రీ పనులను వేగంగా, ఖచ్చితంగా పూర్తిచేయాలని, నిబంధనల మేరకు సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్, మిస్సింగ్ సర్వే, పీవోపీ, డీఎస్ పెండింగ్ అన్ని దరఖాస్తులు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సాదా బైనామా అప్లికేషన్లనీ ముందుగా సిద్ధం చేసి ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే వాటిని పూర్తిచేయవచ్చునని అన్నారు. దరఖాస్తుదారుని ఆధార్‌కార్డ్, పట్టాదారు పాసుపుస్తకం, సాక్షుల ఆధార్‌కార్డ్‌లు సక్రమంగా పరిశీలించాలన్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌లో బయోమెట్రిక్ సరిగా, తప్పులేకుండా చేయాలన్నారు. రెవెన్యూ కార్యాయాల్లో రేషన్‌కార్డుల వివరాలు, మీసేవా ద్వారా సర్టిఫికేట్లు, ఆఫీస్ రికార్డులు, ఇతర అన్ని డాక్యుమెంట్లను సక్రమంగా స్పష్టంగా, అప్‌టుడేట్ గా ఉంచాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు సమయానికి, పారదర్శకంగా అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన 'రెడ్‌క్రాస్' పాలక మండలి సభ్యులు

గద్వాల: రెడ్‌క్రాస్ నూతన పాలక మండలి సభ్యులు బుధవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం, రక్తనిధి కేంద్రం, వయోవృద్ధుల డేకేర్ సెంటర్లకు అవసరమైన స్థలాలు కేటాయించాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు పాలక మండలి సభ్యులు తెలిపారు.

ఇసుక రవాణాలో ఎలాంటి సమస్యలు రానివ్వొద్దు



తుమ్మిళ్లలో ఇసుక తీసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా

- ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు సకాలంలో ఇసుక చేర్చాలి
- టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా

రాజోళి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నేపథ్యంలో ఇసుక రవాణాలో ఎలాంటి సమస్య రానివ్వకుండా తగు చర్యలు చేపట్టాలని టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా ఆదేశించారు. రాజోళి మండలం తుమ్మిళ్ల గ్రామంలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈమేరకు తుంగభద్ర నదిలో ఫ్లెడ్జింగ్ సిస్టమ్ ద్వారా తీస్తున్న ఇసుకను ఆయన పరిశీలించారు. ఇసుకను లబ్ధిదారులకు ఎలా పంపుతారంటూ ఆరా తీశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల కోసం ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ఇసుక సకాలంలో చేరుకోవాలని, లేదంటే ఇంటి నిర్మాణంలో జాప్యం జరుగుతుందని అన్నారు. అలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కాగా జిల్లాలోని పలు చోట్లకు ఇసుకను రవాణా చేస్తున్న క్రమంలో వారికి ఇసుకను చేర్చేందుకు ఉన్న మార్గాల ద్వారా ఇబ్బందులు వస్తున్నాయని కాంట్రాక్టర్లు తెలిపారు. తుమ్మిళ్లలోని ఇసుక రీచ్‌కు, రాజోళి మండలం పడమటి గార్లపాడు గ్రామం దగ్గర ఉండటంతో పాటు, ఆ వైపున ఉన్న గ్రామాలకు అదే మార్గంలో వెళ్తేనే సకాలంలో చేరుకోగలమని, లేదంటే చుట్టూ తిరిగి ఇతర మార్గాల ద్వారా వెళ్లాలంటే సమయం వృథా కావడంతో పాటు, లబ్ధిదారులకు ఇసుక అందించడంలో ఆలస్యం అవుతుందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం ఇసుక తవ్వకాలు ఎందుకు నిలిచాయని అడగగా.. నదిలో వరద ఎక్కువగా ఉన్నందున ఇసుక తీయడం కుదరడం లేదని, నీటి ఉధృతి తగ్గగానే ఇసుకను తీస్తామని, ప్రస్తుతం ఉన్న ఇసుకతో ఇందిరమ్మ ఇళ్లకు నిలపకుండా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ వెంకటరమణ, ప్రసాద్‌బాబు,తహసీల్దార్ పి.రామ్మోహన్,సీఐ టాటాబాబు తదిదరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సమస్యలతో రైతు ఆత్మహత్య


కుర్వ రాముడు (ఫైల్)

ఇటిక్యాల: ఆర్థిక సమస్యలతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవినాయక్ కథనం మేరకు.. మండలంలోని చాగాపురం గ్రామానికి చెందిన కుర్వ రాముడు (50) కొంత కాలంగా మద్యానికి బానిసై ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మన స్థాపానికి గురై తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు తెలిపారు. అతని భార్య కుర్వ సుజాత ఫిర్యాదు మేరకు బుధవారం సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొల్లాపూర్ రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొల్లాపూర్ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. రామాపురం గ్రామానికి చెందిన భాస్కర్ (35) బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని వాగు దగ్గరకు బహిర్భూమికి వెళ్తుండగా, అక్కడే వేలాడుతున్న విద్యుత్ తీగలు తలకు తాకి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ అధికారులు పరిశీలించారు. అనంతరం అక్కడికి చేరుకున్న డాక్టర్లు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. భాస్కర్‌కు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కేఎల్‌ఐ కాల్వలో పడి రైతు మృతి


చాగల రాములు (ఫైల్)

గోపాల్‌పేట: పొలం సమీపంలో ఉన్న కేఎల్‌ఐ కాల్వలో పెట్టిన మోటారు చుట్టూ చేరిన నాచును తీసేందుకెళ్లి రైతు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. రేవల్లి మండలంలోని తల్పునూరు గ్రామానికి చెందిన చాగల రాములు (58) బుధవారం ఉదయం ఎప్పటిలాగే పొలానికి వెళ్లి, ఇంటికి తిరిగి రాలేదు. ఈ క్రమంలో ఆందోళన చెందిన ఆయన చిన్న కుమారుడు ఆంజనేయులు మధ్యాహ్నం నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా రాములు ఫోన్ ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చి పొలం వద్దకు వెళ్లి వెతికినా ఎక్కడా కనిపించలేదు. కేఎల్‌ఐ కాల్వలో ఉన్న వారి మోటారు వద్ద చూడగా నీటిపై తేలుతూ రాములు మృతదేహం కనిపించింది. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై రేవల్లి ఎస్‌ఐ రజితను వివరణ కోరగా.. రాములు కుటుంబ సభ్యులు మృతికి సంబంధించి సమాచారం ఇచ్చారని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని తెలిపారు. మృతుడు భార్య మణెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దేవరకద్ర రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగన్న కథనం మేరకు వివరాలిలా.. గూరకొండ సమీపంలోని కుర్వ శ్రీను రైస్‌మిల్లు వద్ద ఉన్న గదిలో రక్తపు మరకలు, ఫోన్ పడి ఉందని స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి చేరుకొని లభించిన ఆధారాలతో విచారణ చేయగా.. అవి ఊట్కూర్ మండలం మల్లెపల్లి గ్రామానికి చెందిన రాములు(60)విగా గుర్తించారు. వెంటనే విషయాన్ని సదరు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు స్థానికుల సహాయంతో చుట్టుపక్కల రాములు కోసం వెతకగా.. పెద్దగోప్లాపూర్ దగ్గర రోడ్డు పక్కన పండ్ల షాపు వెనకల గాయాలతో మృతిచెంది పడి ఉండటాన్ని గుర్తించారు.

రిజర్వాయర్‌లో దంపతుల గల్లంతు


తాటికుంట రిజర్వాయర్‌లో గాలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు

- చేపల వేటకు వెళ్లిన క్రమంలో చోటుచేసుకున్న ఘటన
- ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల గాలింపు.. ఎమ్మెల్యే, ఎస్పీ పరిశీలన

మల్దకల్: రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన భార్యాభర్తలు ప్రమాదవశాత్తు పుట్టి బోల్తా పడడంతో గల్లంతయ్యారు. ఈ ఘటన మల్దకల్ మండలం తాటికొండ రిజర్వాయర్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తాటికుంటకు చెందిన దుబ్బన్‌బోయి బోయ రాముడు(36), సంధ్య(34) భార్యభర్తలు. చేపలు పట్టుకొని విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. రోజులాగే మంగళవారం సాయంత్రం ఇరువురు చేపల వేటకు వెళ్లారు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వెంటనే రిజర్వాయర్ వద్దకు చేరుకుని పరిశీలించగా అక్కడ రాముడు బైక్, చెప్పులు, వస్తువులు లభించడంతో ఇద్దరు రిజర్వాయర్‌లో చేపల కోసం పుట్టీలో వెళ్లారని గుర్తించారు. రిజర్వాయర్‌లో అలల తాకిడి ఎక్కువ కావడంతో పుట్టి బోల్తా పడి ఉండవచ్చునని గ్రామస్తులు తెలిపారు. భార్యకు ఈత రాకపోవడంతో ఆమెను రక్షించే క్రమంలోనే భర్త మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. మంగళవారం రాత్రి 11గంటల సమయంలో మల్దకల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు జిల్లా ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపారు. దీంతో బుధవారం ఉదయం గల్లంతైన వారి కోసం 50మందితో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య, సీఐ శ్రీను అక్కడికి చేరుకొని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. చేపల వేటకు ఎప్పుడు వెళ్లారు, పూర్తి వివరాలను కుటుంబ సభ్యులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఇదిలాఉండగా, వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాయంత్రం వెళ్లిన తల్లిదండ్రులు ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆ చిన్నారుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.


గల్లంతైన భార్యాభర్తలు రాముడు, సంధ్య (ఫైల్)


గల్లంతైన వారి పిల్లలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు

అన్నివిధాలుగా ఆదుకుంటాం.. : ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వారి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అందే రైతు బీమాతోపాటు ఇద్దరు చిన్నారులకు రూ.5లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ఇద్దరి ఆచూకీ తెలిసే వరకు గాలింపు చర్యలు చేపడతామని ఆయనతోపాటు అధికారులు తెలిపారు. గాలింపు చర్యల్లో తహసీల్దార్ ఝాన్సీ రాణి, గట్టు ఎస్‌ఐ మల్లేష్, ఆర్‌ఐ మద్దిలేటి, మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి అన్నదమ్ములు మృతి

ఊట్కూరు: నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలో ఇంటిపక్కన ఉన్న నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం .. తిమ్మారెడ్డిపల్లి తండాకి చెందిన పూనియానాయక్, జయమ్మ దంపతులకు కుమారులు అభిషేక్(5) ఆకాష్(4) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. సొంత గ్రామం తిమ్మారెడ్డిపల్లి తండాలో వినాయక నిమజ్జనం కోసం రెండు రోజుల క్రితం వచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇంటి పక్కనే కాస్త దూరంలో ఉన్న నీటి గుంతలో పడిపోయారు. పిల్లలు కనపడడం లేదంటూ కుటుంబసభ్యులు గ్రామం మొత్తం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న గంత వద్దకు వెళ్లి చూడగా అందులో చిన్నారులు తెలుతూ కనిపించారు. వెంటనే వారిని బయటికి తీసి ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. ఒకేసారి ఇద్దరన్నదమ్ములు మృతిచెందడంతో తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగారు. ఈ ఘటనపై ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వినాయక నిమజ్జనానికి వచ్చిన చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


తిమ్మారెడ్డిపల్లి తండాలో మృతి చెందిన చిన్నారులు

జూరాలకు తగ్గుతున్న వరద


జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద

10 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/రాజోళి/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం 1.26 లక్షల క్యూసెక్కులు ఉండగా.. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో 1,02,950 క్యూసెక్కులకు తగ్గినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 10 క్రస్ట్‌గేట్లను ఎత్తి 66,776 క్యూసెక్కులు దిగువకు వదిలామన్నారు. విద్యుదుత్పత్తికి 38,225 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 70, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 700, భీమా లిఫ్టుకు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.571 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

474 మెగావాట్ల విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో బుధవారం విద్యుదుత్పత్తి కొనసాగిందని ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 276.486 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 303.685 మి.యూ. ఉత్పత్తి జరినట్లు చెప్పారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 580.171 మి.యూ. ఉత్పత్తి చేపట్టామన్నారు.

సుంకేసు జలాశయం..

సుంకేసుల జలాశయం 18 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 80 వేల క్యూసెక్కుల వరద రాగా.. 18 గేట్లను మీటర్ మేర తెరిచి 76,356 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2,095 క్యూసెక్కులు వదిలినట్లు వివరించారు.

శ్రీశైలంలో 883.2 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో బుధవారం 883.2 అడుగుల నీటిమట్టం.. 205.6627 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు వివరించారు. జూరాల నుంచి 66,776 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 38,225 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 68,882 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుందన్నారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,253 క్యూసెక్కులు దిగువన నాగార్జునసాగర్‌కు వదులుతున్నట్లు వివరించారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 29 వేల క్యూసెక్కులు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,824, ఎంజీకేఎల్‌ఐకు 1,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.990 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.425 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగింది.

ఉత్సాహంగా కొనసాగుతున్న పోటీలు


షార్ట్‌పుట్ విసురుతున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి టీచర్స్ డేను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఆటల పోటీలు రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. సింథటిక్ ట్రాక్, ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలను వీసీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పని ఒత్తిడి తగ్గించుకునేందుకు తప్పకుండా ఆటల్లో పాల్గొనాలన్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బంది అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విజేతల వివరాలను పీయూ పీడీ శ్రీనివాస్ వెల్లడించారు. పురుషుల విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో ఈశ్వర్, విజయ్, కరుణాకర్‌రెడ్డి, షార్ట్‌పుట్ విభాగంలో శ్రీనివాస్, సాయికిరణ్, రాఘవేందర్, కరుణాకర్‌రెడ్డి, గాలెన్న, అర్జున్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, వీసీ శ్రీనివాస్, క్యారమ్స్‌లో రాజశేఖర్, శ్రీశైలం, రెండో బహుమతి విజయభాస్కర్, ఈశ్వర్‌కుమార్ గెలుపొందారు. టెన్నికాయిట్ మహిళా విభాగంలో మొదటి బహుమతి స్వాతి, శ్రీలత, రెండో బహుమతి రజిని, మధులిక, 100 మీటర్ల మహిళా విభాగంలో సంధ్యా, రామంజమ్మ, రజిని, చిన్నదేవి, అరుంధతి, పుష్పలత, షార్ట్‌పుట్ మహిళా విభాగంలో రామాంజమ్మ, స్రవంతి, రజిని, చిన్నాదేవి, మధులిక, శ్రీలత తదితరులు విజేతలుగా నిలిచారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ టోర్నీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రతినిధులు

- 4రోజుల పాటు పాలమూరులోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహణ
- మొదటగా క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు
- 5 నుంచి మెయిన్ డ్రా పోటీలు
- ఏర్పాట్లు చేసిన జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్–13 బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. పట్టణంలో రెండోసారి మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ (ఎండీబీఏ) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇండోర్ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆరు కోర్టుల్లో మ్యాచ్‌ల నిర్వహణ

రాష్ట్రస్థాయి అండర్–13 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలోని నాలుగు సింథటిక్ కోర్టుల్లో మ్యాచులు జరగనున్నాయి. గురువారం క్వాలిఫైయింగ్ రౌండ్, 5 నుంచి 7 వరకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో మెయిన్‌డ్రా పోటీలు జరుగుతాయి. పోటీలో ఉమ్మడి జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 11 మంది అఫీషియల్స్ పాల్గొంటున్నారు. 5వ తేదీన ఉదయం 10 గంటలకు టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నారు. స్టేడియంలో ఏర్పాట్లను మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో టోర్నీ పరిశీలకుడు సుధాకర్, టెక్నికల్ అఫీషియన్ జి.కిషోర్, రెఫరీలు తదితరులు పాల్గొన్నారు.

టోర్నీని విజయవంతం చేస్తాం



జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నాం. అందరి సహకారంతో చాంపియన్‌షిప్‌ను విజయవంతం చేస్తాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తాం.

– ఎస్.శ్యాంసుందర్‌గౌడ్, ఎండీబీఏ అధ్యక్షుడు

టోర్నీ కేటాయించినందుకు ధన్యవాదాలు

జిల్లాకు రెండోసారి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహణకు కేటాయించినందుకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, జిల్లా యువజన, క్రీడాశాఖ సహకారంతో జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం.

– ఎల్.రవికుమార్, ఎండీబీఏ ప్రధాన కార్యదర్శి

'జీవిత బీమా'తో ఆర్థిక భద్రత

- పైలెట్ ప్రాజెక్ట్‌గా కేశంపేట మండలం ఎంపిక
- ప్రతి ఇంట్లో ఒక పాలసీ ఉండాలి
- ఎల్‌ఐసీ ఆలిండియా క్లియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైక్రే

జడ్చర్ల టౌన్: ప్రతి ఒక్కరికీ జీవిత బీమా ద్వారా రక్షణ కల్పించి వారికి ఆర్థిక భద్రతను ఇవ్వడమే లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ముఖ్య ఉద్దేశమని ఎల్‌ఐసీ ఆఫ్ ఇండియా ముంబై సెంట్రల్ కార్యాలయ క్లియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైక్రే అన్నారు. బుధవారం జడ్చర్ల ఎల్‌ఐసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జడ్చర్ల ఎల్‌ఐసీ బ్రాంచ్ పరిధిలోని కేశంపేట మండలాన్ని రెండు తెలుగు రాష్ట్రాలను కలిపి పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రకటించిన సందర్భంగా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి ఒక్కరికీ బీమా సదుపాయం కల్పించాలనే సంకల్పంతో 1956లో కేంద్ర ప్రభుత్వం జీవిత బీమా సంస్థ ప్రారంభించిందన్నారు. నాటి నుంచి ఎంతగానో విస్తరించినా ఇంకా అనేక మందికి పాలసీని అందించలేక పోయిందన్నారు. ఈ నేపథ్యంలో కేశంపేట మండలాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి ప్రతి ఇంట్లో ఒక పాలసీ నినాదంతో ముందుకెళ్తున్నట్లు ప్రకటించారు. ఎల్‌ఐసీ కుటుంబమంతా విశేషంగా కృషి చేసి ప్రాజెక్ట్‌ను విజయవంతం చేయాలన్నారు. 2026 మార్చి 26 నాటికి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ జోనల్ మేనేజర్ పునీత్‌రాజ్ కుమార్, డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, క్లియా ఆర్‌ఎం రాజశేఖర్, ఎంఎం ప్రసాదరావు, మేనేజర్ రవిశంకర్, బీడీబీఎస్ మేనేజర్ జగన్నాథం, జడ్చర్ల బ్రాంచ్ మేనేజర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్లియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైక్రే

నిజాయితీ చాటుకున్న రైతు


బ్యాంకు మేనేజర్ రామకృష్ణకు బంగారు గొలుసు అందిస్తున్న రైతు కొండన్న

అమరచింత: నిజాయితీ కరువైన ఈ రోజుల్లో సమాజంలో ఇంకా నీతి నిజాయితీ ఉందని నిరూపించాడు అమరచింతకు చెందిన రైతు కొండన్న. వ్యవసాయ రుణం రెన్యూవల్ కోసం బుధవారం పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌కు వెళ్లిన కొండన్నకు బ్యాంక్ లోపల 5 తులాల బంగారు గొలుసు కింద పడి ఉండటం గమనించాడు. వాటిని చేతిలోకి తీసుకుని చూడగా బంగారు నానుగా గుర్తించాడు. ఎవరైనా రైతులు పారేసుకున్నారని బావించి అక్కడే ఉన్న బ్యాంక్ మేనేజర్ రామకృష్ణకు బంగారు గొలుసు అందించాడు. సుమారు రూ.5 లక్షల పైగా విలువైన బంగారు గొలుసును నిజాయితీగా బ్యాంక్ మేనేజర్‌కు అప్పగించడంతో పలువురు అభినందించారు. ఈ విషయంపై మేనేజర్‌ను అడుగగా బ్యాంకులో బంగారు గొలుసు దొరికిందని రైతు కొండన్న తమకు అప్పగించాడన్నారు. గొలుసు పోగొట్టుకున్న రైతు వస్తే విచారించి వారికి అందిస్తామన్నారు.

ఏపీలో అదృశ్యమై.. తెలంగాణలో శవమై

- భార్యతో గొడవపడి ముగ్గురు పిల్లలతో భర్త అదృశ్యం
- వెల్దండ మండలం పెద్దాపూర్ శివారులో పురుగు మందు తాగి ఆత్మహత్య
- మిస్టరీగా మారిన ముగ్గురు పిల్లల ఆచూకీ

వెల్దండ: భార్యతో గొడవపడి తన ముగ్గురు పిల్లలతో సహా అదృశ్యమైన వ్యక్తి మూడు రోజుల తర్వాత శవమై కనిపించాడు. తనతో పాటు వచ్చిన ముగ్గురు పిల్లల ఆచూకీ మాత్రం మిస్టరీగా మారింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామశివారులో వెలుగుచూసింది. కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం పెద్దబోయలపల్లికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు (36) ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. గత నెల 30న తన భార్య దీపికతో ఇంట్లో గొడవపడ్డాడు. ఈ క్రమంలో తన ముగ్గురు పిల్లలు మోక్షిత (8), రఘువర్షిణి (6), శివధర్మ (4) పాఠశాల నుంచి ఇంటికి రాగానే.. ద్విచక్ర వాహనంపై వారిని ఎక్కించుకొని బయలుదేరాడు. వారంతా శ్రీశైలం మీదుగా తమ ప్రయాణాన్ని సాగించారు. చివరకు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ శివారులో హైదరాబాద్–శ్రీశైలం రహదారి పక్కనున్న వ్యవసాయం పొలంలో వెంకటేశ్వర్లు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీప పొలాల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని వెల్దండ ఎస్‌ఐ కురుమూర్తి పరిశీలించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ నంబర్ ఆధారంగా వివరాల గుర్తింపు..

ఇంట్లో గొడవపడి పిల్లలతో సహా వెంకటేశ్వర్లు అదృశ్యం కావడంతో అతడి కుటుంబసభ్యులు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామశివారులో వెంకటేశ్వర్లు ఆత్మహత్యకు పాల్పడగా.. అక్కడ ఉన్న బైక్ నంబర్ ఆధారంగా ఇక్కడి పోలీసులు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే వెంకటేశ్వర్లు, అతడి పిల్లల ఆచూకీ కోసం గాలిస్తున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి వచ్చి చూడగా.. అక్కడ పిల్లలు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. శ్రీశైలం నుంచి హైదరాబాద్ రోడ్డులో వారు ప్రయాణించినట్లు తెలుసుకొని మార్గమధ్యంలోని పలుచోట్ల సీసీ కెమెరాలను పరిశీలించారు. శ్రీశైలం–హైదరాబాద్ మార్గంలోని అజీపూర్ వద్ద ముగ్గురు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లినట్లు గుర్తించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోనేటీపూర్ టోల్‌ప్లాజా వద్ద మాత్రం పెద్ద కుమార్తెతో మాత్రమే కనిపించాడని పోలీసులు నిర్ధారించారు. మిగిలిన మరో కూతురు, కుమారుడు కనిపించకపోవడంపై విచారణ చేస్తున్నారు. వెల్దండ పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తూ.. పిల్లల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ముగ్గురు పిల్లల ఆచూకీ మిస్టరీగా మారింది. మృతుడి తమ్ముడు మల్లికార్జున్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.


వెంకటేశ్వర్లు (ఫైల్) ,ఆచూకీ లభించని చిన్నారులు

చిన్నారికి తప్పిన ప్రమాదం

- కారులోపల నాలుగేళ్ల చిన్నారి
- ఆటోమెటిక్‌గా లాకయిన కారు
- అద్దాలు పగులగొట్టి డోర్లు ఓపెన్


కారు వద్ద గుమిగూడిన స్థానికులు, కారులో ఉన్న చిన్నారి


జడ్చర్ల టౌన్: కారు ఆటోమేటిక్‌గా డోర్లు మూసుకుపోయిన నేపథ్యంలో నాలుగేళ్ల చిన్నారి ప్రమాదం నుంచి తప్పించుకొన్న ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రవితేజ భార్య, కుమారుడు తన్విక్‌రెడ్డితో కలిసి షాపింగ్‌కు ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న దుకాణానికి కారులో వచ్చారు. పిల్లాడిని కారులోనే విడిచి ఇంజిన్ రన్నింగ్‌లో ఉంచి భార్యతో కలిసి దుకాణంలోకి వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత కారు డోర్లు ఆటోమెటిక్‌గా లాక్ అయ్యాయి. ఈ నేపథ్యంలో పిల్లాడు కారు అద్దాన్ని కొడుతుండటంతో స్థానికులు గమనించి కారు తలుపు తీసేందుకు యత్నించారు. కారు లోపల నుంచి లాక్ కావడంతో చుట్టుపక్కల ఆరా తీశారు. విషయం తెలుసుకొన్న రవితేజ కారు వద్దకు చేరుకొని ఆటోమెటిక్ లాక్ కావటం గమనించారు. అనంతరం కారు అద్దం పగులగొట్టి పిల్లాడిని బయటకు తీశారు. దీంతో తల్లిదండ్రులతో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



సాక్షి ఫ్యామిలీ
మహబూబ్‌నగర్
గురువారం ॥ 4-9-2025

జాతీయ పోషకాహార వారోత్సవాలు

ఫుడ్ ఫర్ టీన్స్



పిల్లల విషయంలో పెద్దవారికి ఒక రకమైన ఆందోళన ఉంటే... కాస్త పెద్ద పిల్లల విషయంలో ఇంకో రకమైన ఇబ్బందులు ఉంటాయి. అంటే పదేళ్లు దాటి టీనేజ్‌లో ఉండే పిల్లల్లో మరికొన్ని సమస్యలు చూస్తుంటాం. ఈ రోజుల్లో అయితే టీనేజ్ పిల్లల్లో ఆందోళన, మానసిక ఒత్తిడి, అధికంగా కోపం, డిప్రెషన్ వంటివి తరచూ వింటున్నాం. వారు తినే ఆహారపు ప్రభావం మానసిక, శారీరక స్థితిపైన చూపుతుంది. అందుకని, టీనేజ్ పిల్లలున్న ఇంట్లో పోషకాహారం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.

13–19 ఏళ్ల మధ్య ఫిజికల్, మెంటల్ గ్రోత్ వేగంగా మార్పు చెందుతుంటుంది. ఇలాంటప్పుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎమ్‌ఆర్) కొన్ని సాధారణ సూచనలు చేసింది. వాటి ఆధారంగా పోషకాహారాన్ని ఈ వయసు పిల్లలకు సరైన మొత్తంలో ఇవ్వాలి. అలాగే, ఆ ఆహారం మనసుకు సంతృప్తినిచ్చేలా ఉండాలి.

టీనేజ్ పిల్లల బరువు, ఎత్తు, చేసే పనులు.. ఇవన్నీ దృష్టిలో నిపుణుల సలహాతో సమతుల ఆహారాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో కాకుండా రోజులో 5-6 సార్లు సమయాన్ని బట్టి పైన టేబుల్‌లో ఇచ్చిన హెల్తీ ప్లేట్‌ను తయారుచేసుకోవచ్చు.

బ్రేక్‌ఫాస్ట్
కప్పు గోధుమ ఉప్మా /దోసె - 2 / కిచిడీ - కప్పు / రాగి రొట్టె - 2 -3 / ఇడ్లీ - 2-3 + కప్పు సాంబార్ + ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లెట్ + కొద్దిపాటి గింజలు.

ఉదయం స్నాక్స్
పండు (ఆపిల్ లేదా అరటి లేదా నారింజ) + కొద్దిగా డ్రైఫ్రూట్స్ / పల్లీ చిక్కీ / వేపిన శనగలు / వేయించిన అవిసెగింజలు / డ్రై ఫ్రూట్ బార్ / ఉడికించిన వేరుశెనగ

మధ్యాహ్న భోజనం
అన్నం - 1 కప్పు లేదా గోధుమ రొట్టె - 2-3 / తృణ ధాన్యాలు - 1 కప్పు + ఆకుకూరలు - 1 కప్పు + మిక్స్‌డ్ వెజిటబుల్స్ - 1 కప్పు + చికెన్ బ్రెస్ట్ - 100 గ్రా / గుడ్డు - 1 / పనీర్ - 100 గ్రా / చేప - 100-120 గ్రా. + పెరుగు - 1 కప్పు

రాత్రి భోజనం
మధ్యాహ్న భోజనం మాదిరిగానే + గ్రిల్ చేసిన చికెన్ బ్రెస్ట్ అన్నంతో లేదా రొట్టెతో + కూరగాయలు + ఉడికించిన బ్రొకోలీ

సాయంత్రం స్నాక్స్
మొలకెత్తిన గింజలు, విత్తనాలు - 30 గ్రా + చియా సీడ్స్ + నిమ్మరసం/ పాలు/ పండు జ్యూస్ లేదా సూప్.

కిలో కేలరీలు : అబ్బాయిలకు 2200-3200 : అమ్మాయిలకు 1800 - 2500
ప్రొటీన్లు : అబ్బాయిలకు - 52 గ్రా. : అమ్మాయిలకు - 46 గ్రా.
కొవ్వులు (Fat) : 25-35%
కార్బోహైడ్రేట్స్ : 45-65%
విటమిన్-ఎ : 600-900 మైక్రోగ్రాములు
విటమిన్ - సి : 45-75 మి.గ్రా
కాల్షియం : 1300 మి.గ్రా   నీళ్లు - 8 నుంచి 12 గ్లాసులు



– డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

ఫుడ్ గ్రూప్స్, పరిమాణం

ఏదైనా పండు	- 1 రోజుకు 2-3 సర్వింగ్స్
కూరగాయలు	- రోజుకు 3-5 సర్వింగ్స్ (ఉడికించినవి లేదా వండినవి)
ధాన్యంతో వండినవి	- రోజుకు 6 - 8 సర్వింగ్స్ (1 సర్వింగ్ - ½ కప్పు ఉడికిన అన్నం/సిరిధాన్యం/గోధుమ)
డెయిరీ ఉత్పత్తులు	- రోజుకు 2 - 3 కప్పులు (పాలు, పెరుగు, చీజ్ రూపంలో)
ఆరోగ్యకరమైన కొవ్వులు	- రోజుకు 1 టేబుల్ స్పూన్ (నూనె, గింజలు, విత్తనాలు మొదలైనవి)
ప్రొటీన్ ఆహారం	- మాంసం, గుడ్డు మొదలైనవి (1 సర్వింగ్)

● మన(సు)లో మాట

తీవ్ర మనోవ్యాధికి సంజీవని!

మేము కోయంబత్తూరులో సెటిల్ అయిన తెలుగు వాళ్లము. మా అబ్బాయి బీటెక్ తర్వాత ఎం. ఎస్. కోసం సంవత్సరం క్రితం అమెరికాకు వెళ్లాడు. మొదట 6 నెలలు బాగానే ఉన్నాడు. తర్వాత అతని ఆలోచనలు, ప్రవర్తనలు మారాయి. అమెరికాలో ఉన్న పోలీసులు, గూఢాచారులు తనని వెంబడిస్తున్నారని తన మెదడు మీద, ఎలాన్ మస్క్, ట్రంప్ ప్రయోగాలు చేస్తున్నారని అనుమానంతో భయపడుతూ–ఉండేవాడు. ఆ ప్రవర్తన ఎక్కువై బాగా చికాకు చేస్తే అక్కడే ఉండే మా చుట్టాలు 6 నెలల క్రింద ఇండియాకు పంపించారు. ఎయిర్ పోర్టులో దిగాక నేరుగా చెన్నైలో ఒక ఆస్పత్రిలో అడ్మిట్ చేశాము. 'స్కిజోఫ్రినియా' లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, బాగా అగ్రెసివ్‌గా, సూసైడల్ ఆలోచనలతో ఉన్నాడని అక్కడి డాక్టర్లు ఇ.సి.టి. ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మా ఫ్యామిలీ డాక్టర్‌ని అడిగితే ఆయన ఇ.సి.టి. వల్ల మెదడు దెబ్బతింటుంది, భవిషత్తులో ఇబ్బందులు వస్తాయని చెప్పారని, మేము ఆ ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసి వేరే హాస్పిటల్‌కి తీసుకెళ్లాము. పెద్దగా ఫలితం కనిపించకపోయేసరికి ఇంగ్లీష్ వైద్యం కాకుండా వేరేవైద్యానికి వెళ్లాము. చాలా రోజులు ఆ మందులు వాడినా ఎలాంటి మార్పూ లేదు. దయచేసి మాకు ఏదైనా మంచి దారి చూపగలరు.

- సోమలింగేశ్వరరావు, కోయంబత్తూరు

చాలామందిలో అంతర్గతంగా ఉండే ఇలాంటి సమస్యను సాక్షి ద్వారా తెలియజేసినందుకు మీకు నా అభినందనలు. మీ అబ్బాయికి వచ్చిన స్కిజోఫ్రీనియా వ్యాధి వలన ఎంతగా సంఘర్షణకి గురయ్యారో అర్థం అవుతోంది. ముందుగా మీరు అర్థం చేస్కోవాల్సింది, మెదడులో వచ్చే కొన్ని రసాయనిక మార్పుల వల్లనే ఇలాంటి మానసిక సమస్యలు వస్తాయని, అవి తగ్గాలంటే ఆ రసాయనాలని సాధారణ స్థితికి తీసుకురావాలనీ మానసిక వైద్యులు మొదటిగా మందులు, కౌన్సెలింగ్ ద్వారా మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తారు.

అయితే కొన్నిసార్లు ఆ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు లేదా పేషెంటుకి ఆత్మహత్య ఆలోచనలు, జబ్బువల్ల ఇతరులకు హాని చేసేంత ఆవేశం, కోపం, ఉన్నప్పుడు, మందులు పని చేయడానికి చాలా సమయం పట్టొచ్చు: అలాంటప్పుడు పేషెంటుకి కుటుంబ సభ్యులకి జరిగే నష్టం ఎక్కువ. దీన్ని నివారించడం కోసం అత్యంత వేగంగా. ప్రభావ వంతంగా పనిచేసే ఒక సంజీవని లాంటి వైద్య విధానమే' ఇ.సి.టి. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ. అంతమంచి చికిత్స విధానాన్ని వాడుక భాషలో 'షాక్ ట్రీట్మెంట్' అంటారు. అదే అన్ని సమస్యలకి, అపోహలకి కారణం అయింది. దీనివల్ల మనిషికి ప్రాణహాని అని లేదా నరాలు చచ్చుబడి, సంసారానికి పనికి రారు అని అనేక అపోహలు, సాధారణ ప్రజలతో పాటు, కొంత మంది వైద్యుల్లో కూడా ఉన్నాయి. మన శరీరంలో ఇతర జ్ఞానేంద్రియాలు, కండరాలు ఇతర వ్యవస్థలన్ని పనిచేయడానికి మెదడులో ఉత్పత్తి అయ్యే కరెంట్ చాలా ముఖ్యం. దాన్ని మార్చడం ద్వారా మెదడులోని రసాయనాల అసమతుల్యాను కూడా సరి చేయవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఫోన్ లేదా కంప్యూటర్ కి వైరస్ వచ్చి పని చేయక పోతే రీసెట్ ' బటన్ నొక్కి దాన్ని పనిచేసే కండిషన్‌కి ఎలా తీసుకు వస్తామో ఇ.సి.టి. కూడా మెదడుని అలాగే రీసెట్ చేస్తుంది. దీనివల్ల దీర్ఘకాలికంగా ఎలాంటి సమస్యలు వస్తాయని ఇప్పటి వరకు ఎలాంటి శాస్త్రీయ పరిశోధనా తేల్చలేదు. ఒక పేషెంట్ అన్ని రకాలుగా శారీరకంగా ఫిట్‌గా ఉంటేనే ఇ.సి.టి. చికిత్స చేస్తారు. మీ అబ్బాయిని పరీక్షించిన డాక్టరు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకపోతేనే ఇ.సి.టి. ట్రీట్మెంట్ గురించి చెప్పి ఉంటారు. కాబట్టి ఎలాంటి అపోహలు, భయాలు లేకుండా చికిత్స ఇప్పించి, మీ వాడి జబ్బు లక్షణాలను తొందరగా తగ్గించుకోండి.

మీ అలాగే వాళ్ళు చెప్పినన్ని రోజులు మందులు వాడితే జబ్బు మళ్ళీ తిరిగబెట్టకుండా ఉంటుంది. ఆల్ ది బెస్ట్ !



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బయోపిక్

వెండితెరపై కశ్మీర్ కోయిల

మనకు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి తెలుసు.
మహనీయ కర్నాటక సంగీత విద్వాంసురాలు.
లతా మంగేష్కర్ తెలుసు. సినీ సంగీతానికి రారాణి.
కాని రాజ్ బేగం తెలియదు.
ఆమె వీరిద్దరి కాలం నుంచే పాడుతోంది.
వీరితో సమానంగా కశ్మీర్ ప్రజల జేజేలు అందుకుంది.
కశ్మీర్ కోయిల బిరుదు అందుకుంది.
కాని ఆమె దేశానికి తెలియడానికి ఇంత కాలం పట్టింది.
అదికూడా ఇప్పుడు ఆమె జీవితం ఆధారంగా తీసిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమా అమేజాన్‌లో విడుదల అయ్యాక.



1950ల కాలం ఊహించండి.

కశ్మీర్ పర్వత ప్రాంతం. అక్కడివన్నీ గిరిజన సంప్రదయాలు. కశ్మీర్‌కే తనదైన గొప్ప సంగీతం, గానం, వాయిద్యం, కవిత్వం, గీతం... ఉన్నాయి. అక్కడ కశ్మీరీ భాషలో ఎంతో మంచి సాహిత్యం ఉంది. కాని అక్కడ ఉర్దూ, హిందీ కూడా వాడుకలో ఉంది. నిరంతరం ఏదో ఒక అలజడికి లోనయిన ఆ ప్రాంతంలో స్త్రీలు ఏ పనిలో అయినా ముందుకు రావడం కష్టంగా ఉండేది. వారి కళ కూడా నాలుగ్గోడల మధ్యే తప్ప బహిరంగం కావడానికి లేదు.

ఈ నియమాన్ని బ్రేక్ చేసిన గాయని రాజ్‌బేగం.

1927లో శ్రీనగర్‌లో జన్మించిన రాజ్‌బేగం బాల్యంలోనే పాటను గ్రహించింది. అది అక్కడ కురిసే మంచులా ఆమెలో సహజంగా ఉద్భవించింది. గిరిజన గీతాలు, జానపద పాటలు పెళ్లిళ్లలో పాడటం మొదలు పెట్టింది. 1950లలో ఆమె మొదటిసారి ఆల్ ఇండియా రేడియో కశ్మీర్ స్టేషన్‌లో పాడింది. మరో నాలుగేళ్లకు అదే రేడియోలో స్టాఫర్ అయ్యింది. ఆ తర్వాత బహిరంగ వేదికల మీద పాడసాగింది. తన జీవిత కాలంలో కనీసం రెండు వేల పాటలు ఆమె పాడింది. అయితే దురదృష్టవశాత్తు ఏ పాట రికార్డింగూ అందుబాటులో లేదు. కశ్మీర్ సంగీతానికి ఆమె చేసిన సేవకు 2002లో 'పద్మశ్రీ' దక్కినా ఆమెకు రావాల్సిన ఖ్యాతి రాలేదు. 2016లో రాజ్ బేగం మరణించింది. జనం ఆమెను అక్కడ నిత్యం తలుచుకుంటూనే ఉంటారు. దేశానికి ఆమె పేరు చేరలేదు. కశ్మీర్‌లో పుట్టి పెరిగి అమెరికాలో చదువుకొని వచ్చిన అక్కడే స్థిరపడ్డ దర్శకుడు డానిష్ రెంజు ఆమె బయోపిక్‌ను తీసే అవకాశం పొందగలిగాడు. రాజ్ బేగం జీవితాన్ని, సంగీతాన్ని 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'గా తీశాడు. అమేజాన్‌లో ఆ సినిమా ఆగస్టు 29 నుంచి స్ట్రీమ్ అవుతూ విమర్శకుల ప్రశంసలు పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సంగీత అభిమానుల మెప్పు అందుకుంటోంది. దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్ ఈ సినిమాకు ఒక నిర్మాత కావడం విశేషం.

***

'అమ్మా... దేవుడు స్త్రీలను పుట్టించింది కేవలం పెళ్లి కోసం కాదు' అని తన యవ్వన కాలం నుంచి తిరగబడుతూ తన దారిని నిర్మించుకుంటుంది రాజ్ బేగం 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమాలో. పెళ్లిళ్లలో పాడుతూ గుర్తింపు పొందిన రాజ్ బేగం రేడియో కశ్మీర్‌లో ఆడిషన్ ఇవ్వడానికి వెళితే అక్కడంతా అబ్బాయిలే ఉండి 'నువ్వొచ్చావ్ ఏంటి' అన్నట్టుగా చూస్తారు. అయినా వారిని ఎదిరించి ఆడిషన్ ఇచ్చి ఎంపికవుతుంది రాజ్ బేగం. అయితే స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఆమె తన సొంత పేరును చెప్పుకోవడానికి వీలుండదు. 'నూర్ బేగం' పేరుతో రేడియోలో పాడుతుంది. ఇది కొన్నాళ్లకు తెలిసి ఆమె ఊరి వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఆడపిల్ల ఇలా మగవాళ్లుండే చోటుకు వెళ్లి పాడటం ఏంటని రాళ్లతో కొడతారు. బహిరంగ వేదికల మీదకు రాకుండా చూస్తారు. రాజ్ బేగం ఇవన్నీ తట్టుకుని తన పాటను జనం వద్దకు తీసుకువెళుతుంది. ఏ జనమైతే ముందు వ్యతిరేకించారో వారంతా ఆమె అభిమానులుగా మారతారు. ఆమెను తమ ప్రాంతపు సాంస్కృతిక రాయబారిగా చేసుకుంటారు. ఆమె పాటలకు పరవశిస్తారు. తన జీవితంలో వేల కొలది పాటలు పాడి రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చింది రాజ్ బేగం. ఆమె వేసిన దారిలో ఇవాళ ఎందరో కశ్మీర్ గాయనులు పాటలు పాడుతున్నారు. రాజ్ ఎదుర్కొన్న వ్యతిరేకత వీరికి లేదు.



'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'లో యంగ్ రాజ్ బేగంగా సబా ఆజాద్, వృద్ధ రాజ్ బేగంగా సోని రాజ్‌దాన్ (ఆలియా భట్ తల్లి) నటించారు. సినిమా హిందీ భాషలో సాగినా పాటలు కశ్మీర్ సువాసనలతో ఉంటాయి. కశ్మీర్ జీవితం, సంప్రదాయాలు, మాటా, వరుస... అన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఇన్నాళ్లకు కశ్మీర్ సినిమా ఒకటి వచ్చింది.

అది ఒక గాయని గురించి కావడం సంతోషపడవలసిన సంగతి.

కళ మరణించదని మరో సారి నిరూపితమైంది.



● పద్మశ్రీ అందుకుంటున్న రాజ్ బేగం

● పేరెంటింగ్

ఒక హీరో గురించి...

పిల్లలకు ఎప్పుడూ బడి పాఠాలే కాదు బతుకు పాఠాలు, నైతిక విలువల గురించి కూడా చెప్పాలి. అదే నిజమైన పేరెంటింగ్. ఒక తండ్రి తన పిల్లాడికి సులువైన భాషలో మంచీచెడుల గురించి చెప్పిన మాటలు నెటిజనులకు తెగ నచ్చాయి.

ఫైనాన్షియల్ సర్వీసెస్ 'మైఫండ్‌బాక్స్' సీయీవో అనూజ్ పాల్...

'నీ గురించి స్కూల్‌లో ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా?' అని తన చిన్నారిని అడిగాడు.



'నేను ఒకరిని కొట్టాను' అన్నాడు అద్విక్.

'ఎవరిని కొట్టావు? ఎందుకు కొట్టావు?' అని అడిగిన తండ్రి... 'ఒక అమ్మాయిని అలా కొట్టవచ్చా?

నువ్వు ఆ అమ్మాయి వస్తువు లాగేసుకున్నావు. ఇతరుల వస్తువులు అలా లాక్కోవచ్చా? మీ క్లాస్‌మేట్స్ ఇద్దరు కలిసి నిన్ను కొట్టారనుకో, నీకు బాధగా అనిపించదా? వాళ్లు చేసింది తప్పు అనిపించదా... ఇది సరే, నువ్వు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావు? హీరో అవుతావా? విలన్ అవుతావా?' అని అడిగాడు అనూజ్.

'హీరో' అని జవాబు చెప్పాడు అద్విక్.

'తప్పు చేసినప్పుడు సారీ చెప్పేవారే నిజమైన హీరోలు. మరి నువ్వు సారీ చెబుతావా?' అని అడిగాడు తండ్రి. అద్విత్ ఆ అమ్మాయికి 'సారీ' చెప్పాడు! ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

● టెక్నో ఉమెన్

ఛాయా చిత్రం



'మెటా'లో దశాబ్దకాలం పాటు పనిచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్ ఛాయ నాయక్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ'లో చేరింది. ఓపెన్ ఏఐలో ఆమె 'స్పెషల్ ఇనిషియేటివ్స్' టీమ్‌లో పనిచేయనుంది.

'సరియైన సమయంలో సరియైన నిర్ణయం' అని కంపెనీ మార్పు గురించి స్పందించింది ఛాయ. మహారాష్ట్రలోని పుణెకు చెందిన ఛాయ నాయక్ సెక్యూరిటీ, పీస్ స్టడీస్‌లో డిగ్రీ చేసింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పబ్లిక్ పాలసీ, డాటా సైన్స్‌లో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేసింది. పుణేలో 'పాత్‌వేస్ టు ఎంపవర్‌మెంట్'లో ప్రాజెక్ట్ మెనేజర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించింది. ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ కార్యాలయం(యూఎస్)లో జియోగ్రాఫిక్ ఇన్ఫర్‌మేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేసింది. 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫ్యూచర్'లో కన్సల్టెంట్‌గా, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో గ్రాడ్యుయేట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన ఛాయ ఆ తరువాత డాటా–డ్రివెన్, సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టింది. 'మెటా'లో 'డాటా ఫర్ ఇనిషియేటివ్' హెడ్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. ఫేస్‌బుక్‌లో ఓపెన్ రీసెర్చ్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఫోర్ట్) హెడ్‌గా పనిచేసింది. 'ఓపెన్ ఏఐ'లోకి రావడానికి ముందు ఫేస్‌బుక్‌లో జనరేటివ్ ఏఐ ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మెటాలోని తొలి రోజులు నిన్నా మొన్నా జరిగినట్లే అనిపిస్తున్నాయి. మెటాలో పని చేసిన అనుభవం నా కెరీర్‌కు గట్టి పునాది వేసింది' అంటుంది ఛాయ. 'నా ప్రయాణం ఆగిపోలేదు. పుస్తకంలో ఒక పేజీని తిప్పాను. అంతే!' అని లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో కంపెనీ మార్పు గురించి రాసింది ఛాయానాయక్.

● డిజిటల్ అలర్ట్

అలా... ఆమె ప్రాణాలు కాపాడారు!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలికి చెందిన అమ్మాయి ఒకరు 'నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను' అని అర్ధరాత్రి దాటిన తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. 'మెటా' వెంటనే ఈ పోస్ట్‌ను స్టేట్ పోలీస్ మీడియా సెంటర్‌కు పంపి పోలీసులను అలర్ట్ చేసింది. కేవలం పదహారు నిమిషాల వ్యవధిలో ఒక సబ్–ఇన్‌స్పెక్టర్, కొందరు మహిళా పోలీసులు ఆ అమ్మాయి ఉన్న ఇంటికి చేరుకున్నారు. వాంతులు చేసుకున్న ఆ అమ్మాయి నిస్తేజంగా పడి ఉంది. వెంటనే ఆమెను హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

సమయానికి ఆస్పత్రికి తీసుకురావడం వల్ల ఆ అమ్మాయి చావు నుంచి బయటపడింది. ఆమె కోలుకున్న తరువాత... 'ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు?' అని అడిగితే... తాను ప్రేమించిన వ్యక్తి మాట్లాడడం మానేశాడని, తన ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని...ఇలా చెప్పుకుంటూ పోయింది.

పెరుగుతున్న ఆన్‌లైన్ సుసైడ్ అటెంప్ట్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు, మెటా భాగస్వామ్యంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో సుసైడ్–రిలేటెడ్ పోస్ట్‌లపై నిఘా పెడుతున్నారు. వెంటనే రంగంలోకి దిగుతున్నారు. జనవరి 1, 2023 నుంచి ఆగస్ట్ 25, 2025 వరకు 1,315 మంది ప్రాణాలను కాపాడారు.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 3న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,06,810	1,08,950	1,06,970	1,08,950	1,07,200	1,06,960
బంగారం (22 క్యారెట్లు)	99,890	98,050	98,050	1,00,990	98,620	98,050
వెండి	1,27,000	1,26,300	1,37,000	1,26,300	1,26,000	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.